01ATP15F_01ATP15F.qxd 15-08-2024 PM 11:18 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 16 ఆగష్టు 2024 పేజీలు : 04

# సుపరిపాలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది

- చంద్రబాబు సారథ్యంలో సూపర్‌సిక్స్ అమలుతో ఆర్థిక పరిపుష్టి
- బిసి సంక్షేమ,చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత
- ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జెండా వందనం చేస్తున్న మంత్రి సవిత



పరేడ్ వాహనం ఎక్కి అభివాదం చేస్తున్న మంత్రి

**శ్రీసత్యసాయిజిల్లా, ఆగస్టు 15, ప్రభాతవార్త ప్రతినిధి:**
రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని ప్రభుత్వం ముందుకు వెళుతోందని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. గురువారం శ్రీసత్యసాయిజిల్లా కేంద్రమైన పుట్టపర్తి పరేడ్ మైదానం నందు 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి సవితకు తొలుత జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్, జిల్లా ఎస్పి వి.రత్న తదితరులు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఈ వేడుకలలో సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్, డిఆర్ఓ కొండయ్య, అడిషనల్ ఎస్పి ఎన్.విష్ణు, పలువురు జిల్లా ఉన్నతాధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి వేదికపై ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండావందనం చేశారు. పరేడ్ కమాండర్‌ఆధ్వర్యంలో పోలీస్‌దళం మంత్రికి గౌరవ వందనం సమర్పించగా, బ్రాస్ బ్యాండ్ బృందం జాతీయ గీతాన్ని ఆలపించింది. పరేడ్ కమాండర్ స్వాగతం మేరకు ప్రత్యేక పరేడ్ వాహనంలో పరేడ్ మైదానాన్ని సందర్శించి పోలీసు దళాలనుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అతిథి సభా వేదిక వద్దకు చేరుకొని త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మంత్రి తన సందేశాన్ని, ప్రభుత్వం చేపడుతున్న, చేపట్టబోయే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చదివి వినిపించారు. దేశం కోసం అసువులు బాసిన అయన వీరులను స్మరించుకున్నారు. ముఖ్యంగా శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన కల్లూరు సుబ్బారావు, మేళవాయి గోవింద రెడ్డి, పీరూసాహెబ్, కె.వి.రమా కృష్ణారెడ్డి, ఎగువవీధి చితంబర్ రెడ్డి తదితరుల సేవలను స్మరించుకున్నారు. సమాజంలో అందరూ తత్సమానంగా ఎదగాలని, విద్య, వైద్యం సేవలను పరిపూర్ణంగా పొందాలని, పేదరికం నుండి విముక్తి పొందినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లు అవుతుందన్నారు. జనరంజక పాలనతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నారని స్వచ్ఛమైన, అవినీతి రహిత, వివక్ష లేని పారదర్శక పాలన అందించే దిశగారాష్ట్ర ప్రభుత్వం ముందుకెళు తోందన్నారు. ఇందులో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలు చేపడుతున్నామని, 5 సంవత్సరాలలో 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు, లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, తల్లికి వందనం క్రింద ప్రతి బిడ్డకు రూ.15 వేలు, రైతుకు యేడా రూ.20 వేలు ఆర్థిక సహాయం, ప్రతి ఇంటికి యేటా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రజల మధ్య ఉన్న ఆర్థిక అసమానతలను తగ్గించే విధంగా రాష్ట్ర దీర్ఘకాలిక, సుస్థిర అభివృద్ధి లక్ష్యంతో ముందుకెళ్ళడంతో జరుగుతోందని, తద్వారా గ్రామీణ పట్టణ ప్రాంతాల జీవన ప్రమాణాల వ్యత్యాసం తగ్గుతుందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మడకశిర నియోజకవర్గంకు సంబంధించి స్వాతంత్ర సమరయోధులు మేళవాయి గ్రామానికి చెందని గోవింద రెడ్డిని మంత్రి సత్కరించారు. స్వచ్ఛసంకల్పం క్రిందజిల్లాలోని 353 గ్రామ పంచాయతీలను విజువల్లీ క్లీన్ (స్వచ్ఛ) పంచాయతీలుగా మార్చడం జరిగిందని, భూగర్భ శాఖ ఉండి ప్రభుత్వం జులై 2024 8వ తేదిన జీవో నెంబర్ 43 తీసుకువచ్చి ఇసుక డిపోలలో లభ్యమగు ఇసుకను నామ మాత్రపు చార్జీలు టన్నుకు రూ.277లుగా నిర్ణయించడం జరిగిందన్నారు. అనంరతం వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరచిన సేవకులకు, అధకిఆరులు, సిబ్బందికి మంత్రి ప్రశంసా పత్రాలు అందించారు. జిల్లాలో వివిధ శాఖలలో పని చేస్తున్న 48 మంది ఉన్నతాధికారులు, 472 మంది అధికారులు, సిబ్బందికి మంత్రి ప్రశంసా పత్రాలు అందించారు. అలాగే జీవ వైవిధ్యంలో యువత పాత్ర, నషాముక్త్ భారత్ అభియాన్‌పై నిర్వహించిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబ రచిన విద్యార్థులకు,కార్పొరేట్ సంస్థల్లో ఉత్తమ పనితీరు కనబరచిన సెక్టార్లకు, స్వచ్ఛంధ సంస్థలకు ,సాంస్కృతిక బృందాలను మంత్రి అభినం దించి ప్రశంసా పత్రాలు అందించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన పోలీసులకు పతకాలను ప్రదానం చేశారు.




పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి సవిత



ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు మేళవాయి గోవింద రెడ్డిని సత్కరిస్తున్న మంత్రి సవిత

# జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి

- 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకావిష్కరణ చేసి గీతాలాపన చేసిన రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 15 ప్రభాతవార్త**
అనంతపురం జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతూ అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్యపన్నుల, శాసనసభ వ్యవహారాలశాఖామంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంత్రి పయ్యావుల కేశవ్ జాతీయ పతాకావిష్కరణ చేసి జాతీయ గీతాలాపన చేశారు. అనంతరం మంత్రికి పెరేడ్ కమాండర్‌చే రాష్ట్రీల సెల్యూట్ సమర్పణ చేశారు. అనంతరం మంత్రి పెరేడ్ సందర్శన చేశారు. తరువాత పెరేడ్ బృందంచే మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపి అంబికా లక్ష్మినారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, జిల్లా ఎస్పి కెవి మురళీకృష్ణ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమరయోధుల పోరాటబలం, అమరవీరుల త్యాగఫలం బ్రిటీష్ పాలకులపై తిరుగులేని విజయమే మన స్వాతంత్ర్యం భారతావని సంకెళ్లు తెంచుకుని నేటికి 77 ఏళ్లు పూర్తి చేసుకుని 78వ సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభవేళ ప్రజలందరికి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ ఉద్యమంలో మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, లాలాలజపతిరాయ్, భగత్‌సింగ్, చంద్రశేఖర్‌ఆజాద్ వంటి సమరయోధులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. అనంతపురం జిల్లా నుండి పప్పూరు రామాచార్యులు, కైప సుబ్రమణ్యశర్మ, గుత్తి కేశవపిళ్లై, ఐదుకల్లు సదాశివన్, గుత్తి రామకృష్ణ, పెద్దగొంది కొండప్పశ్రేష్టి, జీవరత్నమ్మ, ఆదిశేషయ్య, హంపన్న వంటి ఎందరో మహానుభావులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అనంతపురం జిల్లాలో చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని చేపట్టామన్నారు. సంక్షేమం ద్వారా ప్రజలు మెచ్చే పాలన అందించాలని మానవతా దృష్టితో ఆలోచిస్తే సమస్యలను పరిష్కరించవచ్చని ప్రభుత్వ ఆశయాల మేరకు పేదల సేవలో మనమందరం అనుసంధానం కావాలన్నారు. మనమంతా కష్టపడితే 2047 నాటికి ప్రపం చంలోనే మనం నెంబర్-1గా వుంటామన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన తొలి రోజు మెగా డిఎస్సి, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, ఎన్‌టిఆర్ భరోసా ఫించన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్దరణ, నైపుణ్యగణన ఫైళ్లపై ముఖ్యమంత్రి తొలి సంతకం చేసి ప్రజల పట్ల తనకున్న విశ్వసనీయతను, ఆప్యాయతను చాటుకున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇసుక పాలసీని మన ప్రభుత్వం అమలు చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్య సాధనలో కార్యాచరణను వేగవంతం చేసి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల ప్రగతి సాధనకు నూతనంగా జిల్లాకు విచ్చేసిన యువకులు ఉత్సాహవంతులైన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్న జిల్లా యంత్రాంగాన్ని వ ం న ్ న ్ నా ్ప రి ్త గా అభినందిస్తున్నానన్నారు. ప్రజాప్రతినిధుల, అధికారుల సమన్వయంతో పనిచేసి అనంతపురం జిల్లాను అగ్రపథంలో నిలిపేందుకు మనమందరం అంకిత భావంతో కృషి చేద్దామన్నారు.







ఝాన్సీలక్ష్మీ బాయ్ వేశధారణలో చిన్నారి

ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తోందని, డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవా పథకం కింద హెల్త్ కార్డులో పేరు వున్న ప్రతి ఒక్కరికి ఆరోగ్యం కోసం సంవత్సరానికి 25 లక్షల రూపాయల వరకు అయ్యే వైద్యఖర్చును ప్రతి కుటుంబంలోని అందరికి వర్తింపచేస్తున్నామని ఎన్‌టిఆర్ వైద్య సేవా పరిధిలోనికి 3,257 చికిత్సలు తీసుకొచ్చామని జిల్లాలో 49 ప్రైవేటు, 47 ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 46,042 మందికి చికిత్సలు చేసి 89.15 కోట్లను ఖర్చు చేశామన్నారు. కంటి వెలుగు కార్యక్రమం కింద ఈ ఏడాది ఇప్పటి వరకు 13,414 మంది అవ్వాతాతలకు పరీక్షలు చేశామని ఇందులో కంటి సమస్య కలిగిన 8,959 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేసి మరో 3,418 మందికి శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అభివృద్ధికి సాయశక్తులా పనిచేస్తున్న పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్, ప్రభుత్వ అధికారులకు, రాజకీయ పక్షాలు, స్వచ్ఛంధ సేవా సంస్థలు, బ్యాంకర్లు, మీడియా ప్రతినిధులు, జిల్లా ప్రజలందరికి అభినందనలు తెలిపారు. అనంతరం వేదిక ముందు పెరేడ్ బృందం నిష్క్రమణ చేయగా వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ తరువాత మంత్రిచే విశిష్ట సేవలకు ప్రశంసాపత్రాల ప్రదానం, స్టాల్స్‌ను సందర్శించి జాతీయ గీతాపాలన చేశారు. అంతకుముందు హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు వసంతబాబు, శ్రీనివాసులురెడ్డి, డిటిసి వీర్రాజు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, ఎస్‌డిసి శిరీష, డిపిఒ ప్రభాకర్‌రావు, డిఆర్‌డిఎ పిడి ఓబులమ్మ, ఎస్‌డిసి ఆనంద్, వ్యవసాయశాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఈబి.దేవి, సిపిఒ అశోక్‌కుమార్, కలెక్టరేట్ ఏఒ జి.మారుతి, హార్టికల్చర్ డిడి నరసింహారావు, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూకొఠారి, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వికలాంగుల సంక్షేమశాఖ ఏడి రసూల్, డిఇఒ వరలక్ష్మి, పశుసంవర్ధకశాఖ జెడి సుబ్రమణ్యం, డిఎస్‌ఒ శోభారాణి, సర్వే ఏడి రూప్లనాయక్, డిఎస్‌పి ప్రతాప్‌కుమార్, తహశీల్దార్ హరిప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.




# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆకట్టుకున్న జాగిలాల విన్యాసాలు

- తిలకించిన రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, కలెక్టర్, ఎస్పీలు



విన్యాసాలను ప్రదర్శిస్తున్న పోలీసు జాగిలాలు

**అనంతపురం, ఆగస్టు 15 ప్రభాతవార్త ప్రతినిధి**
.స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో గురువారం నిరన్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పోలీసు జాగిలాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోలీసు జాగిలాలైన లియో, వాగా, ఫైనీ, మిక్కీలు ముందుగా ఈ మేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు అందజేసి స్వాగతం పలికాయి. అనంతరం గౌరవ వందనం చేశాయి. విన్యాసాలులో భాగంగా.. పేలుడు పదార్థాలు ఉందచిన బాక్సులను వెలికి తీశాయి. పెద్ద పెద్ద ప్రమాదాలను తప్పించడానికి ఈ నైపుణ్యం ఉపయోగపడుతుంది. ఆ తర్వాత తన కర్తవ్య నిర్వహణలో భాగంగా ఎన్ని అడ్డంకులు ఎదురైనా దాటుకుంటూ లక్ష్యాన్ని ఛేదించేందుకు ఉపయో గపడే హార్డిల్స్ జంపు విన్యాసాలను సులువగా చేశాయి. అనంతరం.. అపరిచిత వ్యక్తులు ఇచ్చే ఆహారాలను పోలీసు జాగిలాలు పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలను పసిగట్టడం, హత్యలు, గొంగతనాలు జరిగిన సందర్భాలలో నింధితులను గుర్తించడం కోసం మంగళగిరి ప్రత్యేకంగా 8 నెలల శిక్షణ కూడా పొందాయి. ఆ తర్వాత స్పెషల్ పార్టీ పోలీసులు కళ్లకు గంతలు కట్టుకుని పిస్టోల్, కార్బైన్, ఎస్ఎల్ఆర్, ఏకె-47, 303 ఆయుధాలను ఒక్క నిమిషంలోనే భాగాలుగా విడదీసి జోడించడం అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఏ ఆర్ డిఎస్పీ మునిరాజ పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ జాఫర్ ఆధ్వర్యంలో డాగ్ హ్యాండ్లర్స్ సూర్యనారాయణ, మనోహర్, బీమ్లానాయక్, నారాయణస్వామిలు జాగిలాల విన్యాసాలకు మంచి తర్ఫీదునిచ్చారు.

# నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాం

- అమ్మవారి కరుణ ఉన్నంత వరకు పేదల అభ్యున్నతికి పాటుపడతాం : పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



స్వచ్ఛభారత్ ట్రాక్టర్‌లను పంపిణీ కార్యక్రమంలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే



నూతన బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 15 ప్రభాతవార్త**
పుట్టపర్తి నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో అన్నిరంగాలలో అభివృద్ధి చేస్తామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.గురువారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో రాష్ట్ర బిసి సంక్షేమ మరియు చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మతో కలిసి పల్లె సింధూరరెడ్డి,మాజి మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తో పాటు జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్,ఎస్పీ రత్న తో కలిసి పాల్గొన్నారు.అనతరం పుట్టపర్తి నుండి శ్రీశైలం వెళ్లే ప్రయాణీకుల సౌకర్యార్థం పుట్టపర్తి బస్‌స్టాండ్‌లో నూతన బస్సు సర్వీసును ఎమ్మెల్యే సింధూర,మాజి మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణీకుల క్షేమం కోసం ముఖ్యమంత్రి పెద్దపీట వేశారన్నారు.తదుపరి చిత్రవతి రోడ్డులో నూతనంగా నిర్మించిన గంగాభవాని దేవాలయ ప్రారంభోత్సవ,విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజలందరిపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని ప్రార్థించారన్నారు.ఈ సందర్భంగా వేదపండితులు ఎమ్మెల్యే సింధూర,మాజి మంత్రి పల్లెకు ఘన స్వాగతం పలికారు.అనంతరం 78 స్వాతంత్ర్య దినొత్సవ వేడుకలలో భాగంగా పుట్టపర్తి ఆర్డీఓ కార్యలయం వద్ద నియోజకవర్గంలోని 11 పంచాయితీలకు స్వచ్ఛభారత్ ట్రాక్టర్‌లను ఎమ్మెల్యే పల్లె సింధూర,మాజి మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి చేతులు మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడతూ గ్రామ పంచాయితీలే ప్రగతికి పట్టుకొమ్మలాంటివని, వాటిని పరిశుభ్రంగా ఉంచడంలో,ప్రజల ఆరోగ్యంలో పంచాయితీ అధికారులే కీలకమని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు.తదుపరి పుట్టపర్తి చిత్రవతి నదిలో కలుషితమవుతున్న మురుగునీటి నిర్మూలనకు ప్రత్యేక పైప్‌లైన్ పనులను మాజి మంత్రి పల్లె తో కలిసి ఎమ్మెల్యే సింధూర ప్రారంభించారు.ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుట్టపర్తి నగరంలోని మురుగునీరు చిత్రావతి నదిలోకి చేరి కలుషితమవుతొందని. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే సమస్య పరిష్కా రానికి చొరవ తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.నగరంలో పారిశుధ్యం, వీధి లైట్ల సమస్యలు తలెత్తకుండా చూడాలని కమీషనర్ అంజయ్యను ఆదేశించారు.పై కార్యక్రమాలల్లో టిడిపి నాయకులు రామాంజినేయులు, సామకోటి ఆది నారాయణ, రామ్‌లక్ష్మన్,పత్తి చంద్రశేఖర్,పిసి గంగన్న,బెస్త చలపతి,కౌనిలర్ రమణ,మహమ్మద్‌రఫి, శ్రీరామ్‌రెడ్డి, ఒబులేసు, ఉమాపతి, సురేష్, శ్రీరాములు. బిజెపి నాయకులు కొండమరాజు, లాయర్ హరికృష్ణ,జ్యోతి ప్రసాద్,సోకే రామాంజినేయులు, బిజెపి,జనసేన నాయకులు, కార్యకర్తలతో పాటు అధికారులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మున్సిపల్‌చైర్‌పర్సన్ సహా 9 మంది వైసిపి కౌన్సిలర్లు టిడిపిలోకి

- ఎమ్మెల్యే బాలయ్య సమక్షంలో చేరిక



బాలయ్య సమక్షంలో టిడిపిలో చేరిన దృశ్యం

**హిందూపురం, ఆగస్టు 15 ప్రభాతవార్త**
ఊహించిన విధంగానే వైసిపికి చెందిన మున్సిపల్‌చైర్‌పర్సన్ ఇంద్రజ సహా 9 మంది కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సమక్షంలో గురువారం సాయంత్రం టిడిపి కండువాలు వేసుకున్నారు. ఏపిలో భారీ మెజార్టీతో టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఫిరాయింపులు జోరుగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో హిందూపురంలో కూడా వైసిపి నుండి టిడిపిలోకి జంప్ అయ్యారు. కాగా ఎన్నికలకు ముందు ఇద్దరు వైసిపి కౌన్సిలర్లు, ఎంఐఎం కౌన్సిలర్ టిడిపిలో చేరగా తాజాగా చేరారు. మొత్తం 38 మంది మున్సిపల్ కౌన్సిలర్ స్థానాల్లో గత ఎన్నికల్లో 6 మంది మాత్రమే టిడిపి నుండి గెలుపొందగా వైసిపి నుండి 30 మంది గెలిచారు. బలాబలాలు మారిన నేపథ్యంలో మున్సిపాలిటీలో టిడిపి ప్రాతినిధ్యం పెరిగింది. టిడిపిలో చేరిన వారిలో అయూబ్, నాగమణి, సునీతరెడ్డి, మల్లికార్జున, నసీరాభాను, గిరీష్, పరశురాం వున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌మాజీచైర్మన్ అనిల్‌కుమార్, కౌన్సిల్ విపక్ష నేత డిఇ రమేష్, నాగరాజు, టిడిపి కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్‌కుమార్, బిజెపి కౌన్సిలర్ అంజలి, ఎమ్మెల్యే కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాసరావు, బాలాజీ, మంగేష్, తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**అభివృద్ధి కోసమే చేరాం - చైర్‌పర్సన్**
హిందూపురం అభివృద్ధి కోసమే తాము తెలుగు దేశం పార్టీలో చేరినట్లు చైర్‌పర్సన్ ఇంద్రజ మీడియాకు తెలిపారు. హిందూ పురానికి గొల్లపల్లి రిజర్వాయర్‌తో పాటు పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే బాలయ్య ఎంతో కృషి చేశారని కొనియాడారు. మూడు మార్లు హిందూపురం ఎమ్మెల్యేగా బాలయ్య గెలవడంపై శుభా కాంక్షలు తెలిపారు.






